ఆయుర్వేద వైద్యానికి మహర్దశ



పేరలిలో గతంలో ఉన్న ఆయుర్వేద వైద్యశాల



నేడు తీర్చి దిద్దిన ఆయుర్వేద వైద్యశాల

- మారిన పేరలి వైద్య శాల రూపురేఖలు
- పెరిగిన రోగుల సంఖ్య..
- దీర్ఘకాలిక వ్యాధులకు మేలైన వైద్యం

పిట్టలవానిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. ఆయుర్వేద వైద్యానికి ఆయుష్షు పోసింది. ఇందుకు నిదర్శనం కర్లపాలెం మండలం పేరలి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల. నూతన హంగులతో తీర్చి దిద్దడమే కాకుండా అన్ని రకాల ఆయుర్వేద మందులను ఇక్కడ అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన ఆయుర్వేద వైద్యం అందించేందుకు శ్రీకారం చుట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆయుర్వేద వైద్యాన్ని నిర్లక్ష్యం చేశారు. వైద్యశాలలో మందులు సరిగా ఉండేవి కాదు. నేడు అన్ని రకాల మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

హెల్త్ వెల్ నెస్ సెంటర్‌గా అప్‌గ్రేడ్.
పేరలి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను హెల్త్ వెల్‌నెస్ సెంటర్ కింద అప్‌గ్రేడ్ చేశారు. సుమారు రూ.4 లక్షలతో శిథిలావస్థలో ఉన్న వైద్యశాలను నూతన హంగులతో తీర్చి దిద్దారు. అంతేకాక అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. స్థానిక వైద్యులు సిద్ధార్థ ఆయుర్వేద వైద్యం అందించడంతో పాటు.. వైద్యశాల ఆవరణలో ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పెంచుతూ ప్రజలకు వాటి వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తున్నారు. గతేడాది జూన్‌లో బదిలీపై వైద్యులు సిద్ధార్థ ఇక్కడకు వచ్చారు. వీరు వచ్చే నాటికి రోజువారీ రోగులు ఒకరు లేక ఇద్దరు మాత్రమే వచ్చేవారు. ప్రస్తుతం రోజుకు 40 నుంచి 50 మంది వరకు రోగులు వైద్యశాలకు వస్తున్నారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు



కండువా కప్పి టీడీపీ నాయకులను వైఎస్సార్ సీపీలోకి సమన్వయకర్త డాక్టర్ గణేష్

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గణేష్

నిజాంపట్నం: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. అడవులదీవి జెడ్పీ హై స్కూలులో శుక్రవారం 8వ తరగతి విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మన బడి నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసినట్లు ఆయన అన్నారు. విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని, మంచి భవిష్యత్ పొందాలని ఈవూరి సూచించారు. 59 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల, సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, మాజీ ఎంపీటీసీ రైతుబాబు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బెల్లంకొండ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు వైపీ మాణిక్యారావు, చంద్రశేఖర్, బెల్లంకొండ చిట్టిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నాయకుల చేరిక
చెరుకుపల్లి: కూచినపూడి పంచాయతీ యేమినేనివారి పాలెం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వారికి కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన బెల్లంకొండ మహేష్, దాసరి కొండలరావు, ఈవూరి సాయి, బెల్లంకొండ రంజిత్‌కుమార్, మేకా నవీన్‌బాబు, అద్దంకి సత్యనారాయణ, మన్యం వెంకటేశ్వరరావుతో పాటు మరో వంద మంది పార్టీలో చేరారు. రోజురోజుకు వైఎస్సార్ సీపీకి ఆదరణ పెరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయఢంకా మోగించటం తథ్యమని సమన్వయకర్త ఈవూరి పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఈవూరి కేశవతి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..
నగరం: కార్యకర్తలకు అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. నగరానికి చెందిన పార్టీ కార్యకర్త ఉప్పాల సూరయ్య భార్య నాగమల్లేశ్వరి మృతి చెందటంతో శుక్రవారం ఆయన ఆమె మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. రూ.10వేలను వ్యక్తిగతంగా అందజేసి కుటుంబానికి అండగా ఉంటానని హామీనిచ్చారు. సర్పంచ్ ఇంకొల్లు రామకృష్ణ, ఎంపీటీసీ ఉప్పాల వెంకటేశ్వరరావు, నాయకులు చింతయ్య పాగోలు వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

క్లుప్తంగా

ఘనంగా హరిద్ర శృంగారార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఆలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు శ్రీఘ్రముగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా హరిద్ర శృంగారారచ్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బండ్లమ్మను మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఏఓ మీరయ్యకు సన్మానం



భట్టిపోలు: ఉత్తమ వ్యవసాయ శాఖాధికారిగా అవార్డు అందుకున్న గొల్లపోతు మీరయ్యను శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవాల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మీరయ్య అవార్డును అందుకున్నారు. ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సూపరింటెండెంట్ సీహెచ్ జలజ, నాయకులు దావూరి నాగ మల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజి, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



కర్లపాలెం(పిట్టలవానిపాలెం): మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సేవా సమితిలో స్వామీ వివేకానంద 162వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మంగళ హారతి, సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం కూచిపూడి నృత్యం, కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వివేకానంద జీవితంపై శ్రీ రామకృష్ణ సేవా సమితి చీరాల అధ్యక్షుడు వీఎస్ఎన్ మూర్తి ప్రసంగించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తిమ్మరాజు వెంకటసుబ్బారావు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కాటూరి వెంకటేశ్వరరావు, మామిడాల సాంబశివరావు, కాకర్లపూడి రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు మోంట్‌ఫోర్ట్



రేపల్లె రూరల్: సమాజ హిత కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శప్రాయంగా నిలిచిన మోంట్‌ఫోర్ట్ సేవలు ఎనలేనివని మోంట్ ఫోర్ట్ స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్‌కుమార్ అన్నారు. పాఠశాలల వ్యవస్థాపకుడు సెయింట్ మోంట్‌ఫోర్ట్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేక విద్య, సేవ, వైద్య సంస్థలు నెలకొల్పి ఎంతో మందికి ఉపాధి కల్పించటంతో పాటు విద్య, వైద్యం అందించిన మహనీయుడు మోంట్‌ఫోర్ట్ అన్నారు. ఆయన బాటలో ప్రతి ఒక్కరూ నడిచి, సమాజ సేవా కార్యక్రమాలలో తమ వంతు బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మోంట్‌ఫోర్ట్ జీవిత చరిత్ర, సొసైటీ ఏర్పాటు తదిరత అంశాలను నాటిక ప్రదర్శన చేశారు. నగరం మండలం అల్లపర్రు గ్రామంలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసర వస్తువులు, బకెట్లు, ఇతర వస్తు సామగ్రిని అందజేసి అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్‌ప్రిన్సిపల్ జాన్‌పాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నాయకత్వంతో పార్టీ పటిష్టం



కాపు నాయకులతో మాట్లాడుతున్న సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

వేమూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు : గ్రామస్థాయి నాయకత్వం మరింత పటిష్టంగా ఉంటేనే పార్టీ బలోపేతంగా ఉండి ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధిస్తామని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం ఆవరణలో ఆయన మండలంలోని కాపు సామాజిక వర్గ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విషయంలో నాయకులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ప్రతి గ్రామంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో గ్రామ నాయకులు చురుకుగా వ్యవహరించాలని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు తమ అంతరాలను తగ్గించుకుని, టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చేసిన అరాచకాలు, అకృత్యాలను ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను ప్రజలకు అవగతమయ్యేలా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, సర్పంచ్‌లు సనక వెంకట్రావు, గొల్లపూడి వెంకటసుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు బావిరెడ్డి వెంకట్రామయ్య, అమిరిశెట్టి శ్రీధర్, గాజుల్లంక సొసైటీ బ్యాంక్ చైర్మన్ తూము నాగేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, మండల యూత్ కన్వీనర్ సింగం కృష్ణప్రసాద్, మాజీ సర్పంచ్‌లు సుగ్గున మల్లేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

నూతన ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ అనిల్‌కుమార్

పిట్టలవానిపాలెం: చందోలు ఎస్‌ఐగా టి.అనిల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎస్‌ఐ రాజశేఖర్ వేమూరుకు బదిలీ అయ్యారు. అనిల్ కుమార్ అద్దంకి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. శాంతిభద్రతలు పరిరక్షణలో తనవంతు కృషిచేస్తానని ఆయన చెప్పారు. స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

వేమూరు ఎస్‌ఐ రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ రాజశేఖర్

వేమూరు: మండల ఎస్‌ఐగా ఎస్.రాజశేఖర్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన బదిలీపై వేమూరుకు వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న జె.నాగరాజు బాపట్ల ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ఎస్‌ఐ నవీన్ బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ నవీన్

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా నవీన్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రేపల్లె పట్టణం ఎస్‌ఐ గా పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన సురేష్‌ను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు.


కొల్లూరు ఎస్‌ఐగా ఎస్‌వీ రవీంద్రరెడ్డి



ఎస్‌ఐ రవీంద్ర రెడ్డి

కొల్లూరు : మండల ఎస్‌ఐగా ఎస్‌వీ రవీంద్రరెడ్డి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌లో ఉన్న ఆయనను ఎస్‌ఐగా బదిలీ చేస్తూ.. గురువారం ఉత్తర్వులు చేశారు. పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

పెద్దవరంలో వైద్య శిబిరం



నగరం: పెద్దవరం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నగరం పీహెచ్‌సీ వైద్యులు ఎం.రత్నకుమారి, సురేంద్ర నాథ్, నజీలా పర్వీన్, జాన్‌ప్రసాద్ 396 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో బాబూరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలి



పొన్నూరు: వ్యాపారులు తమ వ్యాపార నిర్వహణకు తప్పనిసరిగా లైసెన్సు పొందాలని పొన్నూరు కార్మిక శాఖ అధికారి సాయి జ్యోతి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శాఖ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాపార సంస్థల చట్టం ప్రకారం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. దుకాణాలతో పాటు సంస్థలు ఈ నెల 29 లోపు లైసెన్సు నమోదు చేసుకోవాలని సూచించారు. హోటళ్లు, టీ స్టాల్స్, మెకానిక్ షాపులు, మెడికల్ షాపులు, కిరాణా దుకాణాలు, ఫ్యాన్సీ తదితర వ్యాపార దుకాణాల నిర్వాహకులు తప్పకుండా లైసెన్సు పొంది ఉండాలన్నారు. అలాగే లైసెన్స్ కాలం పూర్తి అయిన వారు రెన్యువల్ చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. వ్యాపార సంఘాలు వ్యాపారులతో రిజిస్ట్రేషన్లు చేయించాలని కోరారు.

క్రాప్ బుకింగ్ డేటా వెరిఫికేషన్



పంట నమోదు డేటా వెరిఫికేషన్ చేస్తున్న ఎంఏవో సుబ్రమణ్యం

గుంటూరు రూరల్: ప్రస్తుతం పంటల్లో సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టి పంట నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం క్రాప్ బుకింగ్ డేటా సూపర్ చెక్ డేటా వెరిఫికేషన్‌ను మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వీఏఏలు పంట నమోదు, ఈ కేవైసీలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు తప్పనిసరిగా తమ పంటను నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి రైతు తమ గ్రామంలోని రైతు భరోసా కేంద్రాలలో పంటలను నమోదు చేసుకోవాలన్నారు. దీని వల్ల అత్యవసర సమయాల్లో పంటనష్టం, ప్రభుత్వం నుంచి సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఆనందబాబు, గ్రామ ఉప సర్పంచ్ నామా నాగేశ్వరరావు, రైతు వంగా నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ మహోత్సవ్‌లో 'సుందరం మాస్టర్' యూనిట్ సందడి



ప్రమోషన్స్‌లో భాగంగా మాట్లాడుతున్న సినీ నటుడు హర్ష

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్–2కే24లో భాగంగా రెండో రోజు శుక్రవారం 'సుందరం మాస్టర్' సినిమా యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హీరో హర్ష చెముడు, డైరెక్టర్ కల్యాణ్ సంతోష్, మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ పాకాల, ప్రొడ్యూసర్ సుధీర్‌లు హాజరయ్యారు. సినీ హీరో హర్ష చెముడు మాట్లాడుతూ విజ్ఞాన్ విద్యాసంస్థలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన నేను... సినీ హీరోగా మీ ముందుకు మీలో ఒకడిగా వస్తున్నానని, మీరే నా భరోసా అని అన్నారు. విద్యార్థులు ఏదైనా కొత్తగా ప్రయత్నించాలంటే గ్రాడ్యుయేషన్ సమయమే సరైనదన్నారు. తాను ఇంజినీరింగ్ చదివేటప్పుడు ఏదో ఒకరోజు నేను కూడా ఇలాంటి కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రావాలని అనుకున్నాను. 10 సంవత్సరాల తర్వాత నేను మీ ముందుకు అతిథిగా రాగలిగానని వెల్లడించారు. మీ మీద మీకు నమ్మకం ఉండాలని, మీకు ఏది అనిపిస్తే అదే చేయాలన్నారు. తన సినీ జీవితంలో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని తెలిపారు. విద్యార్థులందరూ సుందరం మాస్టర్ సినిమాను ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. డైరెక్టర్ కల్యాణ్ సంతోష్ మాట్లాడుతూ బ్యాక్ బెంచ్ విద్యార్థులకు, తోటి స్నేహితులకు సపోర్ట్‌గా నిలిస్తే వారు ఏదో ఒకరోజు అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఈ సినిమా తన మనసుకు బాగా దగ్గరైన సినిమా అని తెలిపారు. ఈ సినిమాలో కామెడీ, ఎమోషన్స్, డ్రామా ప్రేక్షకులందరికీ నచ్చుతాయన్నారు. ఈ సినిమాలో తన పాత్ర ఇప్పటివరకు చేసిన పాత్రల కంటే వైవిధ్యభరితమైందని అన్నారు. అనంతరం సుందరం మాస్టర్ సినిమా యూనిట్ విద్యార్థులతో సెల్ఫీలు దిగారు.

తీర ప్రాంతాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

దుప్పట్ల పంపిణీలో ఎమ్మెల్యే కోన రఘుపతి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: తీరప్రాంతాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. పాండురంగాపురం, అడవిపల్లిపాలెం గ్రామాల్లో వృద్ధులకు శుక్రవారం ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ తీర ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు సంప్రదాయ వేటను కూడా ప్రోత్సాహించటం జరిగిందన్నారు. సాగు, తాగు నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. మరుప్రోలువారిపాలెం నుంచి పాండురంగా పురం మీదుగా చీరాల ఓడరేవు వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డు సుబ్బారెడ్డి, నక్కా వీరారెడ్డి, నాయకులు కోదండం, కొక్కిలిగడ్డ చెంచయ్య, బొడ్డు రఘురామ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నర్రావుల వెంకట్రావు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 61 మంది ఏఎస్ఎన్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ సదర్‌లాండ్ తెనాలిలోని ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో తొలిసారిగా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 61 మంది ఫైనలియర్ డిగ్రీ విద్యార్థుల్ని ఉద్యోగాలకు తీసుకున్నారు. వీరికి ఏడాదికి రూ.3 లక్షల చొప్పున వేతనం ఇస్తారనీ, ఎంపికైన వారంతా బీసీఏ, బీకాం, బీఎస్సీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులేనని ఏఎస్ఎన్ విద్యాసంస్థల ఛైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. డిగ్రీ చదువుతూనే అత్యాధునికమైన ఏఐ, రోబోటిక్ ఆటోమేషన్ టెక్నాలజీని అందించే సదర్‌లాండ్ కంపెనీ ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషమని పేర్కొన్నారు. అకడమిక్ సిలబస్ బోధనతోనే సరిపెట్టకుండా, కంపెనీలకు అవసరమైన ప్రోగ్రామ్‌లను డిజైన్ చేసి, విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఆ క్రమంలోనే ఏఐ, రోబోటిక్ ఆటోమేషన్ టెక్నాలజీని అందించే సంస్థకు ఏకంగా 61 మంది ఎంపికైనట్టు వివరించారు. విద్యార్థుల్ని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అభినందించారు.

రేపల్లె తహసీల్దారుగా రవీంద్రబాబు

రేపల్లె రూరల్: మండల తహసీల్దార్‌గా చొప్పర రవీంద్రబాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లా వింజమూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలో భాగంగా ఆయన రేపల్లెకు విచ్చేశారు. రేపల్లె తహసీల్దార్‌గా పనిచేస్తున్న డి.మల్లికార్జునరావు ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు.

ఘనంగా వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు

తెనాలి టౌన్: పట్టణంలోని తాలూకా హైస్కూల్ గ్రౌండ్‌లో శ్రీ విద్యాపీఠం, సాలీగ్రామ మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు శుక్రవారం ఐదోవ రోజుకు చేరాయి. శ్రీ గోవింద నామ జప యజ్ఞం పూర్ణాహుతిని వేద పండితులు నిర్వహించారు. శ్రీ విద్యాపీఠం నిర్వాహకులు బాలస్వామిజీ పర్యవేక్షణలో స్వామికి విశేష పూజలు జరిపారు. విశ్వశాంతి ఆశ్రమ ట్రస్ట్ పెనుశీల క్షేత్రం వ్యవస్థాపకురాలు శ్రీ విజయేశ్వరిదేవి 10వేల మంది భక్తులతో లలిత సహస్ర పారాయణం చేయించారు. డాక్టర్ అనంతలక్ష్మి వేంకటేశ్వరస్వామి వైభవాన్ని తెలియజేశారు. పూజ్యశ్రీ బాల స్వామీజీ మాట్లాడుతూ శనివారం వెంకటేశ్వరస్వామి పద్మావతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సాలీగ్రామ మఠ ట్రస్ట్ చైర్మన్ నంబూరి కృష్ణమూర్తి, సెక్రటరీ వుప్పల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, రామకృష్ణ, నాగేశ్వరరావు, గుడివాడ శివప్రసాద్, లోకనాథం, మఠం సభ్యులు, శ్రీ విద్యాపీఠం, విజయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు. సుమారు 10వేల మందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్యామ్ మాస్టర్ మృతి బాధాకరం



పిట్టలవానిపాలెం: స్థానిక ఎంపీ యూపీ పాఠశాలలో గతంలో విధులు నిర్వహించిన శ్యామ్ మాస్టర్ మృతి చాలా బాధాకరమని ఎంఈఓ వి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం అనారోగ్యంతో ఉపాధ్యాయుడు శ్యామ్ మృతి చెందడంతో.. ఆయన మృతదేహాన్ని స్వగ్రామం అల్లూరుకు తీసుకువచ్చారు. ఉపాధ్యాయులు పరిశ నరసింహారెడ్డి, మూకిరి ప్రకాశరావు, బీజేపీ రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షుడు మిట్ట వంశీ కృష్ణ తదతరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శ్యామ్ కుమారుడు బీజేపీ రాష్ట్ర యువ మోర్చా కోశాధికారి కృష్ణ చైతన్యకు సంతాపం తెలిపారు.